క్లుప్తంగా

పాఠ్య ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ

సారవకోట: ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికలు సిద్ధం చేసుకుని విద్యాబోధన చేపట్టాలని డిప్యూటీ ఈఓ పగడాలమ్మ సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి జగనన్న విద్యా కానుక కిట్లు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని, కిట్లు తీసుకున్న విద్యార్థుల బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయించాలన్నారు. ఎంఈఓ ఎం.వి.రమణ, హెచ్ఎం రామకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన గ్రామదేవత ఉత్సవాలు


అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సారవకోట: మండలంలోని వడ్డినవలసలో మంగళవారం ప్రారంభమైన గ్రామదేవత ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా చెవిటమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి చిన్నాల వెంకట సత్యనారాయణ, మాజీ సర్పంచ్ బాద్ర లక్ష్మీనారాయణ, ఆలయ ధర్మకర్తలు ఇప్పిలి ఆంజనేయ ప్రసాద్ అమ్మవారిని దర్శించుకున్నారు.

పునరావాస కాలనీలో డ్రైనేజీ నిర్మాణం


డ్రైనేజీ నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

ఎల్.ఎన్.పేట: మండలంలోని శ్యామలాపురం వంశధార పునరావాస కాలనీలో డ్రైనేజీ నిర్మాణం పనులు చేపట్టామని సర్పంచ్ బలగ లక్ష్మి బుధవారం తెలిపారు. శ్యామలాపురం ఆర్‌ఆర్ కాలనీలో పాడలి గ్రామానికి చెందిన నిర్వాసితులకు ప్రభుత్వ స్థలం కేటాయించి కాలనీ నిర్మాణం చేపట్టగా దుగ్గపురం, తులగాం, పాడలి గ్రామాలకు చెందిన పలువురు స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకున్నారు. ఆయా కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా పంచాయతీకి వచ్చిన నిధులతో డ్రైనేజీ నిర్మాణం పనులు చేపట్టామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బలగ గోవిందరావు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి


మృతి చెందిన ఆవు

పాతపట్నం: మేతకు వెళ్లిన ఆవు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయింది. పాతపట్నం దువ్వారివీధికి చెందిన పాడి రైతు కె.కృష్ణ తన ఆవును మేత కోసం రోజూ ఎర్ర చెరువు గట్టుపైకి తీసుకెళ్తుంటారు. బుధవారం సాయంత్రం కూడా ఆవును మేత కోసం తీసుకొని వెళ్లారు. మేత మేస్తుండగా సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లను ఆవు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది.

ఇంటింటికీ తాగునీరు అందిస్తాం

నరసన్నపేట: మండల కేంద్రంలోని పచారీ కాలనీ, శ్రీరామనగర్‌లో ఇంటింటికీ కుళాయి పనులు త్వరితగతిన పూర్తిచేసి నీరు అందిస్తామని సర్పంచ్ బూరల్లి శంకర్ అన్నారు. పచారీ కాలనీలో ఇంటింటికీ కుళాయి పనులను బుధవారం ప్రారంభించారు. ఈ పనులు నెల రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రాంజీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● కృతజ్ఞత..



న్యాయవాదులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న లా నేస్తం పథకం యువ న్యాయవాదులకు ఎంతో మేలు చేయనుందని నరసన్నపేట బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు అన్నారు. జిల్లా వ్యాప్తంగా 51 మంది యువ న్యాయవాదులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. బుధవారం నరసన్నపేట కోర్టు వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమం చేపట్టారు. న్యాయవాది గణేష్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నెలకు రూ.5 వేల చొప్పున ప్రోత్సాహకరం అందించడం ఆనందంగా ఉందన్నారు. న్యాయవాది అనంతరాము తదితరులు పాల్గొన్నారు.

- నరసన్నపేట

● అవగాహన

బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేయడం వల్ల వ్యవసాయానికి ఎంతో మేలు జరుగుతుందని ఘనజీవామృతం సిబ్బంది అన్నారు. సరుబుజ్జిలి మండలంలోని రావివలస రైతు భరోసా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. విత్తనాలు శుద్ధి చేయడం వల్ల తెగుళ్లు అరికట్టవచ్చన్నారు. మొలక శాతం బాగా వస్తుందన్నారు. సర్పంచ్ వండాన కృష్ణ, ఘనజీవామృతం సిబ్బంది రమణమ్మ, అగ్రికల్చర్ అసిస్టెంట్ జగదీశ్వరరావు, ఎల్‌టుఐసీఆర్పీలు పాల్గొన్నారు.

- సరుబుజ్జిలి



● ఎరువుల పంపిణీ



ఖరీఫ్ సీజన్‌లో వరిసాగుకు సంబంధించి రైతులందరికీ ఎరువులు పంపిణీ చేయటం జరుగుతుందని ఎల్.ఎన్.పేట ఏఓ పైడి లతశ్రీ అన్నారు. ఎల్.ఎన్.పేట మండలంలోని కరకవలస రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకుడు బి.సాయి ఆధ్వర్యంలో ఎరువుల పంపిణీ చేపట్టారు. ఇప్పటికే ఆర్‌బీకేకు వచ్చిన డీఏపీ, యూరియా వంటి ఎరువులను పంపిణీ చేయటం జరుగుందన్నారు. మొదటి విడతగా వచ్చిన ఎరువుల పంపిణీ చేసిన తరువాత రెండో విడత ఎరువులు తీసుకువస్తామన్నారు. రైతులకు అవసరమైనంత ఎరువులు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఏఓ తెలిపారు.

- ఎల్.ఎన్.పేట

సీఎం జగన్‌తోనే అభివృద్ధి


ముషిడిగట్టులో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- ముషిడిగట్టు పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం

నరసన్నపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని ముషిడిగట్టు పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఉప్పరిపేట, డోలపేట వాసులు గ్రామానికి వచ్చే రోడ్డు బాగులేక అవస్థలు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నరసన్నపేట నియోజకవర్గంలో ఈ నాలుగేళ్లలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాం, అనేక గ్రామాలకు రోడ్లు వేశాం, ఉప్పరిపేట, డోలపేట గ్రామాలకు రూ.2.20 కోట్లతో రోడ్డు మంజూరైంది, పలుకారణాల వల్ల నిర్మాణ పనులు ప్రారంభంలో జాప్యం జరుగుతుంది, మీరు ఆందోళన చెందవద్దు, మీ గ్రామాలకు రోడ్డు వేసే బాధ్యత నాది అని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మీ ఊరుకి రోడ్డు వేసిన తరువాతే మళ్లీ వస్తానని, రానున్న ఆరు నెలల్లో రోడ్డు పనులు పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ, పార్టీ నాయకులతో కలిసి ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారికి బుక్‌లెట్లు అందించారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని, దీనికి మీరందరూ ఆయనకు అండగా నిలవాలని కోరారు. ఎమ్మెల్యేను గ్రామ సర్పంచ్ దుల్లు కన్నతల్లి, పార్టీ నాయకులు దుల్ల వెంకటరమణ, ఆనంద్, పోలినాయుడు స్వాగతం పలికి సత్కరించారు. ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, జేసీఎస్ కన్వీనర్ సురంగి నర్సింగరావు, పార్టీ నాయకులు శానాపతి శ్రీను, చింతల వెంకటరమణ, చింతల సత్యనారాయణల తదితరులు పాల్గొన్నారు.

అమ్మఒడితో విప్లవాత్మక మార్పు


సువ్వారి గాంధీ

ఆమదాలవలస: అమ్మ ఒడి పథకంతో రాష్ట్రంలో విప్లవాత్మక మార్పు వచ్చిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ అన్నారు. ఆమదాలవలసలోని తన కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. విద్యా ప్రమాణాలను గణనీయంగా పెంచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి ప్రతి ఒక్కరూ జేజేలు పలుకుతున్నారన్నారు. పిల్లలను బడికి పంపే ప్రతి పేద తల్లికి ఏటా రూ.15వేల ఆర్థిక సాయంతో గత నాలుగేళ్లలో ఇప్పటివరకు రూ.26,067.28 కోట్లు అందించారన్నారు. పేదరికమే అర్హతగా, కుల, మత, ప్రాంత, పార్టీ, వర్గాలకు అతీతంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం లబ్ధి చేకూర్చేందుకు పని చేస్తోందన్నారు. పేద విద్యార్థులు చదువుకు నేలా, పాఠశాలలో డ్రాప్ అవుట్స్‌ను గణనీయంగా తగ్గించాలనే ఉద్దేశంతోనే ఈ ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ఈ నాలుగేళ్లలో పిల్లల చదువుల కోసం చేసే ఖర్చంతా వారి భవిష్యత్తుకు పెట్టుబడేనన్నారు. విద్యారంగంలో తీసుకుచ్చిన సంస్కరణ వల్ల మన రాష్ట్రం దేశానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. జగనన్న విద్యా కానుక, గోరుముద్ద, నాడు- నేడు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన వంటి పథకాలతో రాష్ట్రంలో విద్యారంగంలో సమూలంగా ఒక విప్లవాన్నే సీఎం జగన్ తీసుకువచ్చారన్నారు.

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ


మాట్లాడుతున్న ఆర్వో జయదేవి

నరసన్నపేట: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వచ్చే జనవరి నాటికి ఓటర్లు జాబితాను పక్కాగా సిద్ధం చేయనున్నామని, దీనికి అన్ని రాజకీయ పార్టీలు తమవంతు సహాయం అందివ్వాలని నరసన్నపేట ఆర్వో జి.జయదేవి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆమె రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, పోలింగ్ కేంద్రాల బీఎల్‌ఓలతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఎన్నికల కమిషన్ సూచనలు, నిబంధనలు వివరించారు. జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఓటర్ల జాబితలో తప్పుల సవరణ, తొలగింపు, చేర్పులకు అవకాశం ఉందన్నారు. జూలై ఒకటో తేదీ నుంచి నెల రోజులపాటు బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తారన్నారు. వెయ్యికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు ఉంటే వాటిని విభజించే అవకాశం ఉందన్నారు. మరణించే వారిపేర్లు, మైగ్రేషన్ అయిన వారిపేర్లు పరిశీలించి గ్రామస్తుల అంగీకారంతోజాబితా నుంచి తొలగించాలన్నారు. ఓటర్ల జాబితాలో ఒకరి పేరు ఒకచోటే ఉండాలన్నారు. ఒక కుటుంబం పేర్లన్నీ ఒకే పోలింగ్ కేంద్రాల్లో ఉంచేలా చూడాలని ఎంపీపీ ఆరంగి మురళి కోరారు. మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆర్వోకు వినతిపత్రమిచ్చారు. తహసీల్దార్ ఎ.సింహాచలం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు లుకలాపు రవి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే నాలా వర్తింపు


వడ్డినవలసలో రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

సారవకోట: నిబంధనల మేరకే నాలా వర్తింపజేయనున్నట్లు టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని వడ్డినవలస, కేశవలస, అలుదు గ్రామాల్లో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర రంగాలకు వినియోగించుకునేందుకు సంబంధిత రైతులు దరఖాస్తు చేసుకోవడంతో ఆయా భూములను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దరఖాస్తు చేసుకున్న సర్వే నంబర్లు జిరాయితీ, ప్రభుత్వ భూమి, పోరంబోకా తదితర అంశాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. తహసీల్దార్ హనుమంతరావు, డీటీ మధుబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన


జగనన్న కాలనీలో పర్యటిస్తున్న తమ్మినేని చిరంజీవినాగ్, వైఎస్సార్‌సీపీ నాయకులు

పొందూరు: మండలంలోని జగనన్న కాలనీల్లో మౌలిక వసతులను సకాలంలోనే కల్పిస్తున్నామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ తెలిపారు. స్థానిక పైడితల్లి అమ్మవారి ఆలయం సమీపంలో జగనన్న కాలనీల నిర్మాణాలను బుధవారం సందర్శించారు. అధికారులు అలసత్వం ప్రదర్శించకుండా కాలనీల్లో సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, పార్టీ మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, పొందూరు పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాడైన విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాలి


మాట్లాడుతున్న ఎంపీపీ కిల్లి ఉషారాణి

పొందూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కిల్లి ఉషారాణి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లోని పాడైపోయిన, తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాలని ఎలక్ట్రికల్ ఏఈ దుర్గాప్రసాద్‌ను జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు ఆదేశించారు. పంచాయతీలకు వస్తున్న 14వ, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఎక్కువ మొత్తంలో.. విద్యుత్ బిల్లులకే చెల్లించాల్సి వస్తుందని పలువురు సర్పంచ్‌లు ఎలక్ట్రికల్ ఏఈ దృష్టికి తెచ్చారు. కింతలిలో లో ఓల్టేజీ సమస్య ఉందని సర్పంచ్ రాంప్రసాద్, ఎంపీటీసీ హనుమంతురావు సభదృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీరాజ్ బిల్లులు సకాలంలో రావటం లేదని సభ్యులు తెలిపారు. పంచాయతీరాజ్ డీఈ సూర్యప్రకాశరావు మాట్లాడుతూ పీఆర్ ఏఈ ఫల్గుణరావు ఏమయ్యారో తెలియడం లేదనడంతో సభ్యులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఏఈ సెలవు తీసుకోలేదని, విధులకు హాజరు కావడం లేదన్నారు. తాడివలస పంచాయతీ కార్యదర్శి అసలు పంచాయతీకే రావడం లేదని, దీంతో గ్రామంలో పలు సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయని సభ్యులు తెలిపారు. ఆయన స్థానంలో మరొకరిని పంపిస్తామని ఎంపీడీఓ సీపాన హరిహరరావు సమాధానమిచ్చారు. తహసీల్దార్ రాంబాబు, వైస్ ఎంపీపీలు వండాన శ్రీదేవి, కాకర్ల చల్లమాంబ, సర్పంచ్ లక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, ఏఎంసీ చైర్మన్ సునీల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ముగిసిన రథయాత్ర


పాతపట్నం: జగన్నాథస్వామి తీరువీధి నిర్వహిస్తున్న భక్తులు

పాతపట్నం: జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. స్థానిక బ్రాహ్మణ వీధిలో ఉన్న గుడించా మందిరం వద్ద కొలువైన జగన్నాథ స్వామి దశావతారాల్లో చివరిదైన కల్కీ అవతారంలో భక్తులకు బుధవారం దర్శనమిచ్చారు. స్వామి వారిని బ్రాహ్మణవీధి గుండిచా మందిరం నుంచి జగన్నాథ స్వామి ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం మారు దశమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అవలింగిలో..

సారవకోట: మండలంలోని అవలింగి జగన్నాథ స్వామి ఆలయంలో గత 9 రోజుల నుంచి జరుగుతున్న రథయాత్ర బుధవారంతో ముగిసింది. స్థానిక గుడించా మందిరంలో 9 రోజులపాటు స్వామి వారిని వివిధ రూపాలలో అలంకరించారు. బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి రథంపై జగన్నాథస్వామి ఆలయానికి తరలించారు.

విష్ణుమూర్తి అవతారంలో..

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వరాలయంలో జగన్నాథస్వామి బుధవారం విష్ణుమూర్తి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

బాధ్యతల స్వీకరణ

పాతపట్నం: పాతపట్నం ఎంఈఓగా పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీధర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంఈఓగా పనిచేసిన సీహెచ్ మణికుమార్ ఎల్.ఎన్.పేట ఎంఈఓగా వెళ్లారు. ఎంఈఓ శ్రీధర్‌కు హెచ్ఎంలు అభినందించారు.

పొందూరు: మండల విద్యాశాఖాధికారిగా పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.వెంకటరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పొందూరు ఎంఈఓగా ఉన్న పీవీ రామరాజు కొటబొమ్మాళి ఎంఈఓగా బదిలీపై వెళ్లారు.

నాలుగేళ్ల డిగ్రీతో ప్రయోజనం


ప్రశాంత్ కుమార్


కొత్తూరు: జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా తీసుకు వచ్చిన సమీకృత ఉపాధాయ విద్య డిగ్రీ కోర్స్‌తో విద్యార్థులు మంచి ప్రయోజనం ఉంటుందని స్థానిక మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు, విద్యావేత్త అంపిలి ప్రశాంత్ కుమార్ అన్నారు. కొత్తూరులో బుధవారం విలేకరులతో మాట్లాడారు. నాలుగేళ్ల ఈ కోర్స్‌లో డిగ్రీతోపాటు బీఈడీ పూర్తవుతుందన్నారు. ఈ కోర్స్ చదివిన విద్యార్థులకు ఒక సంవత్సరం కలిసివస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ కోర్స్‌ను దేశంలో మొదటిసారిగా 42 యూనివర్సిటీల పరిధిలో అమలు చేస్తోందన్నారు. మన రాష్ట్రానికి రెండు కేంద్రాలు మంజూరు చేసిందన్నారు. ఇందులో జిల్లాలోని బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీకి మంజూరు కావడం మన అదృష్టమన్నారు. ఈ కోర్స్ మన జిల్లాకు మంజూరు అయ్యేందుకు విశేష కృషి చేసిన బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్


ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

పోలాకి: రోడ్డు ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్ఐ వి.సత్యనారాయణ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ముఖ్యంగా స్కూల్ పిల్లలకు తీసుకెళ్లే ఆటోవారిపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, ముఖ్యకేంద్రాల్లో ట్రాఫిక్‌కు అడ్డంగా ఆటోలు పెట్టడంపై ఎస్ఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు పెడతామని హెచ్చరించారు. మండలంలో ఉన్న ఆటో స్టాండ్‌లు అన్నింటి నుంచి సదరు యూనియన్ల బాధ్యులు డ్రైవర్ల ఫోన్ నంబర్లు, లైసెన్స్ వివరాలు అందజేయాలని సూచించారు. పిన్నింటిపేట వైపు వచ్చే ఆటోల్లో ఓవర్‌లోడ్, సౌండ్ సిస్టం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ కట్టడి చేసేందుకు గురువారం నుంచి ముఖ్య కేంద్రాల్లో తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

వెల్‌నెస్ కేంద్రం తనిఖీ


ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ మీనాక్షి

పొందూరు: గ్రామాల్లో వెల్‌నెస్ సెంటర్లలో వైద్య సిబ్బంది విధుల్లో ఎటువంటి నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బొడ్డేపల్లి మీనాక్షి సూచించారు. మండల కేంద్రంలోని పొందూరు వెల్‌నెస్ సెంటర్-2ను బుధవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ పర్యటనలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని, అవి సక్రమంగా లేకపోతే తగిన చర్యలను ఎదుర్కోవల్సి వస్తుందన్నారు. తాడివలస పీహెచ్‌సీ డాక్టర్ జి.రమేష్ ఉన్నారు.

సంక్షిప్తంగా..

సమయపాలన తప్పనిసరి

కొత్తూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించాలని స్థానిక సీడీపీఓ విమల కుమారి తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నివగాం, ఆకులతంపర సెక్టార్ స్థాయిలో బుధవారం నిర్వహించిన సమావేశంలో కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల హాజరు శత శాతం ఉండాలన్నారు. జూలై ఒకటో తేదీ నుంచి బాలింతలు, గర్భిణులకు టీహెచ్‌ఆర్‌లను ఇంటింటికీ పంపిణీ చేయాలన్నారు. వైఎస్సార్ కిట్లు పంపిణీ చేయాలని కార్యకర్తలకు సూచించారు. లబ్ధిదారులకు మూడు కిలోల బియ్యం, కిలో పప్పు, అర కిలో నూనె, 25 గుడ్లు, ఐదు లీటర్ల పాలు టీహెచ్‌ఆర్ కింద పంపిణీ చేయాలన్నారు.

నేడు అక్షర బ్రహ్మ ఆలయం ప్రారంభం

కొత్తూరు: ఈ నెల 29న మండలంలోని కారిగూడ గిరిజన గ్రామంలో అక్షర బ్రహ్మ ఆలయాన్ని ఒడిశా మాజీ మంత్రి గిరిధర్ గొమాంగో ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి హాజరవుతారన్నారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

పాతపట్నం: మండలంలోని జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సరైన పరిష్కారం వచ్చేలా మండల అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి మంచు కరుణాకరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై బుధవారం సమావేశం నిర్వహించారు. 1920కి ఫోన్ చేసి సమస్యలు చెబితే తక్షణమే ఆయా శాఖల అధికారులు స్పందించాలన్నారు. తహసీల్దార్ రవిచంద్ర, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, డీటీ ప్రసాదరావు, ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా, వైద్యుడు శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థికి జగనన్న విద్యా కానుకలు అందాలి

కొత్తూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లును ప్రతీ విద్యార్థికి అందేలా హెచ్ఎంలు చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు కోరారు. కొత్తూరులో బుధవారం జరిగిన హెచ్ఎంల సమావేశంలో మాట్లాడారు. అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, ఫీజురీయింబర్స్‌మెంట్‌తోపాటు పలు రకాల పథకాలు ఈ ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ పథకాలు విద్యార్థులకు చేరవేయడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలన్నారు. ఎంఈఓలు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష విజయవంతం చేయాలి

పాతపట్నం: జూలై 1 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న జగనన్న సురక్ష ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి వారికి కావల్సిన ధ్రువపత్రాలు అందజేయాలని, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సెక్రటరీలు, సచివాలయ సిబ్బందితో బుధవారం సమీక్షించారు. ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటింటా సర్వేలు సక్రమంగా చేయాలని ఈఓపీఆర్డీ ఆనందరావు తెలిపారు. మండలంలోని తెలికిపెంట గ్రామ సచివాలయంలో బుధవారం గ్రామ వలంటీర్లు, సచివాలయం సిబ్బందితో అవగాహన సమావేశం నిర్వహించారు. జూలై 1 నుంచి ప్రతీ సచివాలయంలో శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

ఎల్.ఎన్.పేట: జగనన్న సురక్ష కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని, ప్రజల సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు చెట్టు రాము అన్నారు. మండలంలోని సరడాం గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష సర్వే చేపట్టారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. ఆయా సేవలను పొందేందుకు గ్రామ వలంటీర్, గ్రామ సచివాలయ ఉద్యోగుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఎటువంటి రుసుం తీసుకోకుండానే ధ్రువపత్రాలు మంజూరు చేయటం జరుగుతుందన్నారు.